క్లుప్తంగా

ఘనంగా దానేశ్వరి అమ్మవారి వార్షికోత్సవాలు



స్థానిక గుమ్ములూరు రోడ్డులోని దానేశ్వరి అమ్మవారి సంబరం

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు రోడ్డులోని దానేశ్వరి అమ్మవారి వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారికి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయం నుంచి సంబరం తరలి వెళ్లింది. పుర వీధుల గుండా సంబర మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి బియ్యం, పసుపు కుంకుమలు సమర్పించారు. సంబరంలో వివిధ శక్తి వేషాలు, కర్ణాటక డప్పు ప్రదర్శనలు, గరగ నృత్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండారు జలదుర్గా ప్రసాద్, కార్యదర్శి జంగారెడ్డి రఘురామరెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సోమేశ్వరావు

కాళ్ల: మండలంలోని పెదఅమిరం గ్రామంలోని అన్నాఆదర్శనగర్ కాలనీ వాసులకు రహదారి కష్టాలు తీరనున్నాయని సర్పంచ్ డొక్కు సోమేశ్వరావు తెలిపారు. నాగులుకోడు మురుగు డ్రెయిన్‌పై గతంలో ఏర్పాటు చేసిన తూముల వంతెనను మురుగు డ్రెయిన్ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించామన్నారు. కాలనీవాసులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డ్రెయిన్ అవతలి వైపు గట్టుపై శాశ్వత ప్రాతిపదికన పంచాయతీ నిధులు సుమారు రూ. 4 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. మంగళవారం ఈ పనులను ఆయన పర్యవేక్షించారు. రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈయన వెంట పలువురు పంచాయతీ బోర్డు సభ్యులు, అధికారులు ఉన్నారు.

అమ్మవారికి రూ.50 వేల విరాళం



అమ్మవారికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారికి హైదరాబాద్‌కి చెందిన చింతలపాటి సుభాస్ చంద్ర బోసు రాజు రూ.50 వేలు కానుకగా అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు కొప్పేశ్వరరావు పూజలు, ఆశీర్వచనాలు నిర్వహించి శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

షైనీకి ఇంటర్నేషనల్ పురస్కారం

ఆకివీడు: అంతర్జాతీయ కరాటే ప్రతిభా పురస్కార అవార్డును మండలంలోని అజ్జమూరు గ్రామానికి చెందిన గంటా షైనీ మంగళవారం పొందారు. హైదరాబాద్‌లో కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో ఈ పురస్కారం లభించినట్లు ఆమె తండ్రి కరాటే మాస్టర్ గంటా శ్రీను తెలిపారు. పోటీల్లో 19 దేశాలకు చెందినవారు పురస్కారాల్ని అందుకున్నట్లు చెప్పారు.

ఘనంగా రాజ్యలక్ష్మి, పోలేరమ్మ జాతర మహోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి పోలేరమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం గ్రామ దేవత పొలిమేర బొక్క వారి పాలెం నుంచి రజక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రభ మహోత్సవ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నాయకులు వేండ్ర వెంకటస్వామి, తదితర బొక్క వారి పాలెం గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆదిలక్ష్మి పొలిమేర బొక్క వారి పాలెం వద్ద నుంచి ప్రభ మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. 23వ మహా జాతర, 26 అఖండ అన్న సమారాధనను జయప్రదం చేయాలని కోరారు. రజక యూత్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలో భాగంగా విశాఖ పట్టణానికి చెందిన చిన్నారి వేమిరెడ్డి కోమలిదేవి చేసిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా చిరంజీవి కోమలిదేవిని ఉత్సవ కమిటీ కార్యదర్శి మానే తేజ ఘనంగా సత్కరించారు.

గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి మంగళమేనా?

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామస్థాయిలో ప్రతిరోజూ స్పందన
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పట్టింపే లేనట్టు వ్యవహరిస్తున్న వైనం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహదేవపట్నం గ్రామ సచివాలయంలో స్పందనకు ఏర్పాటు చేసిన కౌంటర్లు (ఫైల్)

ఉండి: సచివాలయాల పరిధిలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా సౌలభ్యంలో భాగంగా నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతీరోజు స్పందన కార్యక్రమానికి నేటి కూటమి ప్రభుత్వం మంగళం పాడేసినట్లే ఉంది. గ్రామ సచివాలయాల్లో ఎక్కడా దాని ఆనవాళ్లు కనిపించక పోవడమే కారణంగా ఉంది. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోమన్‌రెడ్డి ప్రభుత్వంలో అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి అంటూ ప్రతీరోజు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరిపైనైనా ఫిర్యాదు చేసేందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతీరోజు సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయంలోని అందరూ అధికారులు ఈ స్పందనకు హాజరైయ్యేవారు. గ్రామంలో ఏవిధమైన సమస్య ఉన్నా స్థానికంగా ప్రతీరోజు ఒక గంటపాటు నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదు చేసి సమస్యలను వెంటనే పరిష్కరించుకునేవారు. దీనివల్ల గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో ప్రజలకు దూరాభారం, ఆర్థిక ఇబ్బందులు, సమయం వృధా కాకుండా ఇంటివద్దనే స్పందన జరగడంతో ప్రజలకు మరింత అనుకూలంగా ఉండేది. జీవనోపాధి నిమిత్తం వివిధ పనులకు వెళ్లే గ్రామీణ ప్రజలను దృష్టిలో పెట్టుకుని నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం ప్రజలకు మళ్లీ కష్టాలు తీసుకువచ్చింది. గ్రామస్థాయిలో ప్రతీరోజు గంటపాటు జరిగే స్పందన కార్యక్రమంపై చిన్నచూపు చూడటంతో ప్రజలు మండలస్థాయి స్పందన కొరకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామస్థాయిలోని స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

నియోజకవర్గంలోని గ్రామాలు, సచివాలయాలు

- ఉండి మండలం 19 గ్రామాలు, 21 సచివాలయాలు
- కాళ్ళ మండలం 21 గ్రామాలు, 21 సచివాలయాలు
- పాలకోడేరు మండలం 14 గ్రామాలు, 18 సచివాలయాలు
- ఆకివీడు మండలం 16 గ్రామాలు, 20 సచివాలయాలు

సుదూర ప్రాంతాల ప్రజలకు భారంగా

స్పందన కార్యక్రమం గ్రామస్థాయిలో జరగకపోవడంతో మండల శివారు ప్రాంతం ఉణుదుర్రు, యండగండి, ఉప్పులూరు, పాందువ్వ, ఆరేడు, కలిగొట్ల గ్రామాలు సుమారు 10 నుంచి 15 కి.మీ. దూరంలో ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే చినపుల్లేరు, చెరుకువాడ, మహదేవపట్నం, కోలమూరు, చిలుకూరు గ్రామాలు సుమారుగా 10కి.మీ లోపులో ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఎన్నో వ్యయప్రసాల కూర్చాల్సి వస్తోంది.

పేరుకుపోతున్న సమస్యలు..

ఆయా గ్రామాల్లోని సమస్యలపై అధికారులకు చెప్పేందుకు మండల కేంద్రానికి రావాల్సి ఉండటంతో చాలా మంది ప్రజలు, బాధితులు ఇబ్బందులు పడి సమస్యలను చెప్పలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి.

గ్రామస్థాయి స్పందన కొనసాగించాలి



ప్రజల సమస్యలు దృష్టిలో ఉంచుకొని వెంటనే గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలి.ఓ మంచి కార్యక్రమాన్ని నీరుగార్చకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని గ్రామస్థాయిలో సమస్యలను గ్రామస్థాయిలో పరిష్కరించుకునేలా సచివాలయాల్లో గత ప్రభుత్వం మాదిరి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

– జీ సుందర్‌కుమార్, న్యాయవాది, ఉణుదుర్రు

ఇంత దూరం ఎలా వస్తారు?



ఏదైనా సమస్యపై ఫిర్యాదు లేదా వినతిపత్రం అందించాలంటే మండల కేంద్రానికి ప్రజలు రావడం చాలా ఇబ్బందితో కూడుకున్న విషయం. కాబట్టి గ్రామస్థాయిలో నిర్వహించే స్పందన కార్యక్రమం తిరిగి పూర్తిస్థాయిలో కొనసాగించాలి.అలా చేయగలిగితే మాలాంటి వారికి సుమారు 15కి.మీ. దూరం ప్రయాణించాల్సిన పని ఉండదు. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– గొంతే హరీష్, పాందువ్వ

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే మహిళలు, వృద్ధులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. వారి కష్టాలు చెప్పుకునేందుకు గత ప్రభుత్వం అద్భుతంగా గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా దానిని పూర్తిస్థాయిలో కొనసాగించాలి.

– బొడ్డు నాగన్న, చెరుకువాడ

అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు కొనసాగించాలి



అల్లాడి నటరాజు

ఆకివీడు: అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు కొనసాగించాలని వికలాంగుల సంక్షేమ సంఘం(విసాస్) రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడి నటరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల పింఛన్ల పరిశీలన(తనిఖీ) కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని అనర్హులైన వికలాంగులకు పింఛన్లు తొలగించాల్సిందేనని, అర్హులకు మాత్రం అన్యాయం జరగకూడదన్నారు. 2010లో సదరం ఏర్పాటు చేసి దివ్యాంగులకు స్లాట్‌లో పేరు నమోదు చేసుకున్న తరువాత ధ్రువీకరణ పత్రం అందజేయలేదన్నారు. డాక్టర్ ధ్రువీకరించిన విధంగానే పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. అయితే సదరం ధ్రువీకరణ పత్రం అందని దివ్యాంగులకు ప్రస్తుత తనిఖీలో అర్హులు కూడా పింఛన్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వారి వద్ద ధ్రువీకరణ పత్రం లేదని, ప్రస్తుతం సదరంలో నమోదు చేసుకునేందుకు స్లాట్‌లో పేరు నమోదు అవ్వడం లేదని చెప్పారు. గతంలో నమో దు జరిగినందున ఉమ్మడి జిల్లాలోని సదరం ధ్రువీకరణ పత్రాల్ని యథావిధిగా దివ్యాంగులకు అందజేయాలని ఆయన కోరారు. ఆవిధంగా చేయలేని పక్షంలో జిల్లా విడిపోయినందున సాఫ్ట్‌వేర్‌ను మార్చి నూతనంగా సదరం స్లాట్‌లో పేరు నమోదు అయ్యే విధంగా యంత్రాంగం సరిచూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికార యంత్రాంగం లోపంవల్ల వందలాదిమంది దివ్యాంగులు పింఛన్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నూతనంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు, భీమవరంలో సదరం క్యాంపులు జరుగుతున్నాయన్నారు. కొంత మంది అవయవ లోపాలున్న వ్యక్తుల పేర్లు స్లాట్‌లో నమోదు కావడంలేదని తన దృష్టికి వచ్చినట్లు నటరాజు చెప్పారు. సదరం ధృవీకరణ పత్రాలు అందజేసిన తరువాతే తనిఖీలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పలురకాల అవయవ లోపాలున్న వ్యక్తులు సదరం ధ్రువీకరణ పత్రం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి పెట్టి దివ్యాంగుల్ని ఆదుకోవాలని నటరాజు విజ్ఞప్తి చేశారు.

రసాభాసగా ఉండి మండల సర్వసభ్య సమావేశం

- నిబంధనలకు విరుద్ధంగా చెరువు తవ్వకంపై ఎంపీటీసీల మండిపాటు



మండల పరిషత్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

ఉండి: అందరికీ అన్నీ తెలుసు కానీ ఎవ్వరికీ ఏమీ తెలీదు అన్నట్లు ఉంది ఉండి మండలంలోని అధికారుల వింత వైఖరి. దీంతో మంగళవారం ఉండి మండల పరిషత్ సాధారణ సమావేశం రసాభాసగా మారింది. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై పాములపర్రు ఎంపీటీసీ మండల జనసేన అధ్యక్షుడు యడవిల్లి వెంకటేశ్వరరావు, ఉప్పులూరు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్‌లు అధికారులను నిలదీశారు. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖ వింతవైఖరిపై వారు మండిపడ్డారు. ఇటీవలే ఉండి గ్రామ పరిధిలో బొండాడ డ్రెయిన్‌ను ఆనుకుని ఓ రైతు చెరువులు తవ్వడంపై ఎంపీటీసీలు అధికారులను నిలదీసారు. దీనిపై ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. ఇరిగేషన్ ఏఈ జయప్రకాష్‌ను నిలదీయగా తనకు ఏమీ తెలియదని ఇదంతా మత్స్యశాఖ నిర్వాకమని ఆయన తేల్చేయడంతో కొంతసేపు ఇరిగేషన్ ఏఈకి మత్స్యశాఖకు ఎఫ్‌డీఓ రాంబాబుకు వాగ్వాదం జరిగింది. అయితే తవ్వుతున్న చెరువు వద్దకు వెళ్లిన ఎఫ్‌డీఓ దగ్గరుండి మరీ అనుమతులు ఉన్నాయని చెరువును అడ్డుకునేందుకు వచ్చిన వారికి సమాధానం చెప్పి మరీ చెరువు తవ్వించినట్లు ఈ సందర్భంగా పలువురు ఆరోపించారు. అంతే కాకుండా సరిహద్దు రైతు దాట్ల శ్రీనివాసరాజు చెరువు అక్రమ తవ్వకంపై అధికారులకు గతంలోనే ఫిర్యాదు చేసినా ఏ అధికారి కూడా పట్టించుకోకపోవడంతో సదరు రైతు కోర్టును ఆశ్రయించాడు. దీనిపై ఎఫ్‌డీఓను ప్రశ్నించగా తనకు ఏమీ తెలీదని కొంతసేపు, ఏవరో వ్యక్తి తమకు ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తామన్నారు. ఆక్వాజోన్ పరిధిలో ఉంటే అనుమతులు వాటికవే వచ్చేస్తాయని చెప్పడం, మత్స్యశాఖ ద్వారా అనుమతులన్నీ ఇచ్చేస్తామని ఏ అధికారులకు చెప్పాలిన అవసరం లేదని ఎఫ్‌డీవో పొంతనలేని సమాధానాలతో జరిగిన తప్పిదాన్ని కప్పిపుచ్చేందుకు అవస్థలు పడుతున్నట్లుగా తెలుస్తుందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.అయితే ఇరిగేషన్ ఏఈని చెరువులు తవ్విన రైతు ఫోన్‌లో బెదిరించినట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ కే నాగార్జున స్పందిస్తూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి చెరువులను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా లేకపోతే వాటిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.దీనిపై ఎంపీటీసీలు స్పందిస్తూ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే నిబంధనలకు విరుద్ధంగా చెరువుల తవ్వకం జరిగిందని ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా డ్రెయిన్‌గట్లుపై చెరువుగట్లు వేయడాన్ని సరిచేయాలంటూ వారు అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్యామలాదేవికి సత్కారం



శ్యామలాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిని స్వచ్ఛంద సంస్థ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, డీటీడీసి బాబు, లయన్స్ కృష్ణంరాజు సత్కరించారు. ఉచిత మెగా షుగర్ మెడికల్ క్యాంప్‌తో శ్యామలాదేవి, వారి కుటుంబ సభ్యులు అందజేసిన సేవలు అద్వితీయమని అన్నారు. కృష్ణంరాజు ఆశయాలకు అనుగుణంగా వారి సతీమణి కుటుంబ సభ్యులు పేద ప్రజలకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం మహా యజ్ఞంలా సాగిందని, ఇటువంటి వైద్య శిబిరాలు మరెన్నో ఏర్పాటు చేయాలని వారు కోరారు. శ్యామలాదేవి మాట్లాడుతూ భీమవరంలో తలపెట్టిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అన్ని వర్గాల ప్రజలు సహకారం అందజేశారని, లండన్ వైద్యులు, అబుదాభి, హైదారాబాద్ వైద్యులచే రెండో రోజు 20 మందికి చికిత్సలు భీమవరంలో అందిస్తున్నామని, భవిష్యత్‌లో కూడా ఇటువంటి వైద్య శిబిరాలను భీమవరంలో నిర్వహిస్తామని తెలిపారు.

కోళ్ల పెంపకంలో సంరక్షణ చర్యలు పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): కోళ్ల పెంపకంలో జీవ సంరక్షణ చర్యలు పాటించడం ద్వారా వైరస్ వ్యాధులను నివారించగలమని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె. మురళీకృష్ణ తెలిపారు. శీతాకాలంలో దేశవాళీ కోళ్లలో మిక్సెడ్ వైరస్ వ్యాధులు సోకి మరణాలు సంభవించడం జరుగుతుందన్నారు. వ్యాధి సోకిన కోళ్లు లక్షణాలు చూపించకుండా నిమిషాల వ్యవధిలో చనిపోతుయని, ఈ వైరస్‌లు మనుషుల సంచారం, గాలి, నీరు, కోళ్ల ద్వారా ఒక చోట నుంచి మరొక చోటకి వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ వ్యాధిని అదుపు చేయాలంటే చక్కటి జీవ సంరక్షణా విధానాలు పాటించాలని సూచించారు. ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుచున్న ఈ సమయంలో కోళ్లను పరిమిత ప్రదేశంలో కట్టి ఉంచాలి. ఎక్కువ ఖాళీ ప్రదేశంలో మేపినట్లైతే వ్యాధి ప్రబలే అవకాశం ఎక్కువ నీరసంగా కనిపించిన కోడిని వెంటనే ఆరోగ్యంగా ఉన్న కోళ్లకు దూరంగా ఉండాలి. కోడి గిట్టలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. కోడికి ఉపయోగించు తాగునీటి గిన్నెలు మేత తొట్లను ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలి. వ్యాధి సోకిన కోళ్లకు పూర్తిగా వ్యాధి తగ్గిన తర్వాతనే వ్యాక్సినేషన్ ప్రారంభించాలి. వ్యాధి సోకిన రైతులు మీ సమీప పశు వైద్యుని సంప్రదించి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి 31 వరకు పశుసంవర్ధక శాఖ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



కోలమూరు ఉచిత వైద్య శిబిరంలో వైద్యులను అభినందిస్తున్న సర్పంచ్ రామకృష్ణంరాజు

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలో శివజ్యోతి మెడికల్స్, ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉచితవైద్య శిబిరంలో వైద్య సేవలు అందించిన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, చెవి, ముక్కు,ఆర్థోపెడిక్, చర్మవ్యాధుల వైద్యులను సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు ప్రజలంతా వినియోగించుకోవాలని సూచించారు. అసరాన్ని బట్టి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా నిర్వహించేందుకు ఆశ్రం ఆసుపత్రిలో ఏర్పాట్లు చేసారని తెలిపారు.ఈ వైద్య శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు అందుకున్న 150 మంది రోగులకు నిర్వాహకులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ మొబైల్ క్యాంపును నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలో 6 ఏళ్లలోపు వయసు గల పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కాళ్ల ఎంపీడీవో జి స్వాతి తెలిపారు. రాష్ట ప్రభుత్వ ఆదేశాల మేరకు కాళ్ల మండలంలో మూడు చోట్ల ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఆమె మంగళవారం తెలిపారు. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బొండాడ, దొడ్డనపూడి, కోలనపల్లి సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ఆమె పరిశీలించారు. వీటికి సంబంధించి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లతో పాటు సిబ్బంది సూచనలు ఇచ్చి ఆయా గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రజలకు తెలియపరిచామన్నారు. ఆరు సంవత్సరాల లోపు వయసుగల పిల్లలకు ఆధార్ నమోదు, పేరులో తేడాలు మార్చుకోవచ్చన్నారు.

తెన్నేటి మాస్టార్‌కు ప్రతిభా పురస్కారం

పాలకోడేరు: పశ్చిమ గోదావరి జిల్లా సాహితీవేత్త, పాలకోడేరు తెలుగు మాస్టారు, అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు తెలుగు భాష, సాహిత్యాలలో చేస్తున్న కృషిని గుర్తించిన అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ అకాడమీ సంయుక్తంగా తెన్నేటి మాస్టారుకు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని 2025 జనవరి 21వ తేదీ మంగళవారం కొత్తా పూర్ణానంద్ విలాస్ కళావేదిక విజయవాడలో అందజేశారు. ఈ సందర్భంగా తెన్నేటి మాస్టార్‌ను శ్రీ శ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతిలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మన వంశం మణిధర్, రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్వీయస్. రాజు, గొల్లలకోడేరు, పాలకోడేరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ (కరణం గారు) కార్యదర్శి ఫణి, ప్రధానోపాధ్యాయులు మహేష్ బాబు తదితరులు సాహితీ మిత్రులు తెన్నేటి మాస్టారును అభినందించారు.

దోపిడీ రహిత సమాజం కోసం ఐక్యంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం

భీమవరం: ప్రపంచం తొలి సోషలిస్టు వ్యవస్థ నిర్మాత వి.ఐ.లెనిన్ జీవితం కార్మిక వర్గ విప్లవ పోరాటానికి స్ఫూర్తి అని సీపీఎం రాష్ట కార్యదర్శి మంతెన సీతారాం అన్నారు. రష్యా సోవియట్ యూనియన్ విప్లవ వీరుడు వి.ఐ.లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా లెనిన్ శత వర్ధంతి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పెట్టుబడి - ప్రజాస్వామ్యం అంశంపై భీమవరంలోని ప్యాడి అండ్ రైస్ మర్చంట్ హాల్లో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు సీపీఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి. గోపాలన్ అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. ప్రారంభ సూచికగా లెనిన్ చిత్రపటానికి మంతెన సీతారాం, బి.బలరాం, జే.ఎన్.వి.గోపాలన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రాష్ట కార్యదర్శి మంతెన సీతారాం మాట్లాడుతూ ప్రపంచ తొలివెలుగుల ఎర్రజెండా రాజ్య స్థాపకుడు, విప్లవ వీరుడు వి.ఐ.లెనిన్ అని కొనియాడారు. సమాజంలో పేదరికం, నిరుద్యోగం, సంక్షోభాలు, అసమానతలు లేని సమసమాజం ఒక్క సోషలిజమే అని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి కూడా మోదీ విధానాలనే అవలంభిస్తోందని అన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలపై ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని సీతారాం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, చింతకాయల బాబూరావు, డి.కళ్యాణి, జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విష్ణు విద్యార్థుల ప్రతిభ



హైడ్రోజన్ హెచ్‌సీఎన్‌జీ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన విష్ణు విద్యార్థులు

భీమవరం: ఇండోర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి హైడ్రోజన్ హెచ్‌సీఎన్‌జీ బాహా పోటీల్లో మొదటి స్థానంలో విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు మొదటి బహుమతి పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు మంగళవారం తెలిపారు. ఎస్.ఏ.ఈ ఇండియా వారిచే దేశంలోనే మొట్టమొదటిసారిగా ఈ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేసిన ఆల్ టెరేన్ వాహనాలు ప్రదర్శించి, వాటి పనితీరును పరీక్షిస్తారన్నారు. ఈ పోటీలో తమ కళాశాల మెకానికల్, ఏఐఎంఎల్ విద్యార్థుల బృందం (టీం అమిగోస్) తయారు చేసిన హైడ్రోజన్ వాహనం విజేతగా నిలవడంతో పాటుగా ఐదు విభాగాల్లో (ఇంజనీరింగ్ డిజైన్, ఎండ్యూరెన్స్, పెర్ఫార్మెన్స్, సస్టైనబిలిటీ, స్పెషాలిటీ, యాక్సిలరేషన్) ప్రథమ స్థానంలో నిలిచి నగదు రూ.1.30 లక్షల పురస్కారాన్ని, అవార్డును అందుకున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీచే ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్ పో- 2025 లో ఈ వాహనాన్ని జనవరి 17 నుంచి 22 వరకు ప్రదర్శిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సొసైటీ చైర్మన్ కె.వి. విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ కె. ఆదిత్య విస్సం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, విద్యార్థులను అభినందించారు.

అంబేడ్కర్ చిత్రపటంతో రిపబ్లిక్ డే జెండా ఆవిష్కరించాలి

వీరవాసరం: మండలంలోని రిపబ్లిక్ డే జెండా ఆవిష్కరణ జరిగే సమయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచి జెండా వందనాలు నిర్వహించాలని మండల మాల మహానాడు అధ్యక్షుడు తాడి రాజశేఖర్ మంగళవారం కోరారు. భారత రాజ్యాంగాన్ని సుమారు మూడు సంవత్సరాల పాటు కష్టపడి రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జెండా ఆవిష్కరణ దగ్గర అంబేడ్కర్ చిత్ర పటాలు ఉంచాలని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులకు వినతిపత్రం అందజేశారు.